గడవకుండా చూడ్డానికి తగిన జిత్తులు, రాజకీయాలు ప్రయోగించడం మొదలెట్టేశారు. అయితే నరసయ్యు మర్చిపోలేదు. వాసుని ఎలాగేనా దెబ్బ కొట్టాలని కదా అతని దీక్ష! అందుకని వాసు ఆఫీసుకి రాగానే నరసయ్య ఎదురెల్లి, "విష్యు ఏ హేపీ న్యూ ఇయర్!" అని అతని రెండు చేతులూ పట్టుకుని ఊపేశాడు.

"మీరు నాకు ఈ కొత్త సంవత్సరంలో ఏం జరగాలని కోరుకుంటున్నారో అదే మీకూ జరగాలని నేనూ కోరుకుంటున్నాను" అన్నాడు వాసు.

"మళ్లీ మొదటికొచ్చావు గదయ్యా!" అన్నాడు నరసయ్య చప్పున వాసు చేతులు వదిలేసి. "అంటే, నేనీ సెక్షన్నించి ట్రాన్స్‌ఫరై వెళ్లిపోవాలనేగా, నీ ఉద్దేశం?" అని కోపంగా చూసేడు.

వాసు చిరునవ్వు నవ్వేడు. "వెళ్ళిపోతే మాత్రం ఏం లాభం? నేను కూడా అక్కడికే తయారైపోతాను గాబోలు, ఆలోచించండి" అన్నాడు.

సెక్షన్ అంతా గొల్లుమని నవ్వారు.

★

# 27. కొత్తపాటలు పాడుకొమ్మందిరా, ఎంకి!

'నాన్న ఉన్నాడట్రా?' అని అడిగేను లోపలికి ప్రవేశిస్తూ.

వాసు మాట్లాడకుండా, బాత్ రూం వేపు చూపించి, వాడి చెవికి వాడి అరిచెయ్యి దొప్పలా పెట్టుకుని నన్నూ అలా చెయ్యమన్నట్టు సంజ్ఞ చేసేడు. నేను కూడా కళ్లు చికిలించుకుంటూ నా చెవికి నా అరిచెయ్యి దొప్పలా పెట్టుకునేసరికి అంతసేపూ వినపడుతున్న శబ్దాలన్నీ ఏమైపోయేయోగాని బాత్‌రూమ్‌లో మా వెంకన్న బావ పాడుతున్న పాట వినిపించింది. కొన్ని కారణాల వల్ల ఆ పాడుతున్నది మా బావేనా అని అనుమానం వేసి నేను మా మేనల్లుడి వేపు చూడలేదు. అంచేత, వాసుగాడు అక్కడ ఒక కుర్చీ వెయ్యడం వెంటనే తుర్రుమని మరో గదిలోకి పారిపోవడం నేను గమనించలేదు.

'హిస్టరీ లెక్చరుంది, మిస్టరీ పిక్చరుంది; బెస్ట్ ఏదో చెప్పరా!'

అని మా వెంకన్న బావ పాటలో ఒస్తున్న మాటలు విని కుర్చీలో చతికిలపడ్డాను. మైండ్ అంతా నాన్‌ప్లస్ అయిపోయింది. అలా రెండు నిమిషాలు కూర్చునే సరికి మా 'వెంకన్న బావ' ఇవతలికొచ్చి 'బావా, ఎప్పుడు వచ్చితీవు?' అని పాత బాణీలో అడిగేడు.

"ఏదీ, ఇందాకటి పాట మొదట్నించీ పాడు?' అన్నాను.

మొహమాటపడకుండా ఆరంభించేశాడు మా బావ. అందుకే అతనంటే నాకిష్టం. పాటలు పాడ్డం ఒచ్చిన వాళ్లని ఓ పాట పాడమని అడిగితే నాకేమీరాదండీ అనో, గొంతుక సమంగా లేదనో, మూడ్డు బావులేదనో కొంతసేపు మనల్ని ఏడిపించిగాని పాడకపోడం సామాన్యం. మా వెంకన్న బావ అలా కాకుండా ఎప్పటి-ఎక్కడి-ఎలాంటి-పాటైనా సరే, ఒక చిన్న బిట్టు అయినా సరే, 'ఏదీ, ఓసారి అను', అని అడగడం తరువాయి, అందుకుంటాడు.

'బోటనీ క్లాసు వుంది; మేటనీ ఆటవుంది; వోటుదేనికో చెప్పరా!

హిస్టరీ లెక్చరుంది, మిస్టరీ పిక్చరుంది; బెస్టు ఏదో చెప్పరా-

కొంతమంది పాటకులు ఉంటారు. వాళ్లతో ఒక గొడవ వుంది. 'మూడిచ్చి పాడించడం ఆరిచ్చి ఆపించడం' అంటారు ఆ గొడవని, క్లుప్తంగా. "పాడమని నన్నడగవలెనా, పరవశించి పాడనా?" అని తగులుకుని "ఆపవయ్యా మహాత్మా" అని మనం కాళ్లావేళ్లా పడ్డా ఆపనిరకం కొందరుంటారు. మాబావ అలాంటి వాడుకాదు కనక 'ఉండు, ఉండు' అన్నట్టు అరి చెయ్యి పెట్టగానే పోలీసు అరచెయ్యి చూడగానే ఆగిపోయిన వెహికిల్‌లా ఆపేశాడు, పాట.

'ఏమిటి, ఈ పతనం?' అన్నాను.

'పతనం ఏం లేదు. జతనం అంటే యత్నం - అనగా ప్రయత్నం. శంకరాభరణం శాస్త్రిగారు చెప్పినట్టు మౌలికంగా పాడ్డం అంటూ చేతనయితే ఏ పాట అయినా పాడీయొచ్చు' అన్నాడు మా బావ.

'అదిసరే, ఇలాంటి కొత్తపాటలంటే నీ కాట్టే యిష్టం లేదుకదా, ఇప్పుడెలా సిద్ధపడ్డావు?'

'అదా? అదంతా చెప్పాలంటే చాలా టైం పడుతుంది' అని ఈజీచేర్ వాల్చుకుని దాంట్లో సెటిలైపోయి, 'అదంతా చెప్పాలంటే ఇంకా బోలెడు తైలం కావాలి' అన్న (మిస్సమ్మ సినిమాలో) రేలంగిలా పెట్టేడు పోజు.

'మొన్న డిసెంబర్‌లో మా అమ్మాయి పెళ్లి చేసేం కదా. మా పెదనాన్నగారి సంతానం ఎనిమిది మందీ వాళ్ల సంసారాలతో సహా ఆ పెళ్లికి రావడం అదంతా గిన్నీస్ బుక్‌లోకి వెళ్లవలసిన లాంటి ఒక రికార్డు. అది వేరే సంగతనుకో. అయితే ఇక్కడికొచ్చే దాకా వాళ్లలో ఏ ఒక్కరూ కూడా మా అమ్మాయి కోసం ప్రెజెంటేషన్ ఏదీ తేలేదని ఇక్కడికొచ్చేక తెలుసుకున్నారులా వుంది. సరే, అందరం కలిసి ఒచ్చినా, ఒచ్చి కలిసినా; ప్రెజెంటేషన్ మాత్రం కలిసే ఇద్దాం - అని అప్పటికప్పుడు నిర్ణయించుకుని; గబగబలాడుతూ డబ్బులు పోగేస్తే - మొత్తం రెండువేలు అయింది నిమిషాల మీద. స్టెయిన్‌లెస్ స్టీలు పళ్లాలూ, గ్లాసులూ, టిఫిన్ డబ్బాలు వాటర్ జగ్గులూ ఎన్ని కొన్నా రెండు వేలకి చేరడం లేదు బిల్లు; అని గ్రహించి, ఆఖరికి ఒక సంసారపక్షపు స్టీరియో టేపు రికార్డర్-కమ్-రేడియో కొనేసి తెచ్చేరు. మా అమ్మాయి పెళ్లయిన తరువాత వెంటనే అత్తవారింటికి వెళ్లిపోలేదు. ఎందుకంటే, వెళ్లినా ఎదర సంక్రాంతి పండుగ ఉంది కదా, వెంటనే రావాలని. అందుకని ఆ నెల్లాళ్లూ ఊరికే కూర్చోపెట్టడం ఎందుకు అని, పోతే పోయాయని ఓ నాలుగువందల రూపాయలు పట్టుకెళ్ళి బజార్నుంచి పాతపాటల్లో మంచి వాటితో తయారుచేసిన కేసెట్లు కొనుక్కొచ్చాను. అందులో ఘంటసాల కేసెట్లు కొన్ని ఉన్నాయి. ఎన్నిట్లో ఎన్నుంటేనేం గాని, వాట్లో ఒకదాంట్లో ఘంటసాల పాడిన ఒక మంచి పాట ఉన్నాది. 'మనవి సేయవే, మనసార చెలికి నాదు ప్రేమ' అని ఆ పాట పల్లవి. ఆ పాట ఎంత మెత్తగా హాయిగా ఉందో! అందులో టి.వి. రాజు ఇచ్చిన బేక్‌గ్రౌండ్ మ్యూజిక్కి చేసును, అక్షర లక్షలు! ఇహ అది విన్నాక మా వాళ్లని మరి ఏ పాటా పెట్టనివ్వకుండా అదే వింటూ అదే పాడుతూ ఇంట్లో ఉన్నంతసేపూ ఒక అద్భుతమైన ట్రాన్స్‌లోకి వెళ్లిపోయేననుకో!'

'అవును, ఆ పాటంటే నాకూ ఇష్టమే' అన్నాను.

'ఇష్టమని మెల్లిగా అంటున్నావా!' అని కథలో దిగాడు మా వెంకన్న బావ. 'సరే, పండక్కి

మా అల్లుడు రావడం, మా అమ్మాయిని తీసుకుపోడం ఐంది కదా. మా అల్లుడేమో, మా ఇంట్లో ఇంతకన్నా మంచి టేపు రికార్డరే ఉన్నాది కనక ఇది ఇక్కడే వుణ్ణియ్యండి, మేం ఎప్పుడేనా వొస్తే నాలుగు పాటలు వినొచ్చు. అని మా అమ్మాయికి ప్రెజంటేషన్‌గా వొచ్చిన టేపురికార్డరు వొదిలేసి వెళ్లాడు. పాత పాటలు బావున్నాయంటూ కేసెట్లు మాత్రం పట్టుకుపోయేడు.'

'అయ్యో, ఆ పాట ఉంటే ఒకసారి విందామనుకున్నానే!' అన్నాను.

'టేపు రికార్డరు ఊరికే వుండిపోయిందే అని మా వాసుగాడికి ఓ వంద రూపాయలిచ్చి ఏవో నాలుగు కేసెట్లు కొని తెచ్చీరా, అన్నాను. వాడు తెచ్చిన కొత్త కేసెట్లలో ఒక దాంట్లో ఉంది, ఈ బోటనీ క్లాసు పాట. రెండు రోజులపాటు ఈ కొత్తపాటలు విన్లేక ఆఫీసులో ఓవర్‌టైమ్ ఒప్పేసుకుని తప్పించుకున్నాను గాని, అలా ఎన్నాళ్లు తప్పించుకోగలం? ఇహ కొసాకీ ఈ పాటలు వింటూ ఉండవలసిందే కదా అని అప్పుడు ఇవన్నీ వింటున్నాను.'

'పాపం, నీకు కష్టమే' అన్నాను.

'కష్ట మేమిటుందిలే-'

'కష్టం కాకేమీ? మనసున మల్లెల పాటా సడిసేయకోగాలి పాటా పాడిన నోటితోటే బోటనీ క్లాసు పాటలు పాడేస్తున్నావు, పువ్వులమ్మిన ఊళ్లోనే కట్టెలు అమ్మినట్టు' అని మా వెంకన్న బావ మీద సానుభూతి చూపించేను. మా బావ రెండు నిమిషాలు మౌనం పాటించేడు.

'ఎంకి పాటలు నీకు గుర్తున్నాయి కదా'

'అవును. చాలా బాగా పాడేవాడివి' అన్నాను.

'ఉత్త మాటలు నీవి, పొమ్మందిరా;

ఎంకి,

కొత్తపాటలు పాడుకొమ్మందిరా!' అని ఎత్తుకుని పాట పాడుతూ తన తత్వం సూచించేడు మా వెంకన్నబావ.

★

# 28. రోజూ కోటిమంది అనుభవం

**మ**నకి జోకులా వినిపించే ఒక సంభాషణ ఆ మధ్య ఒక ఫారిన్ మేగజైన్‌లో చదివేను.

జపానుకి వెళ్లిన ఒక భారతీయుడు (భారతీయుల్లో ఎక్కువమంది 'జపానికి' వెళ్లేవాళ్లుంటారు గాని 'జపానుకి' వెళ్లేవాళ్లు కూడా కొందరు ఉంటారు కదా!) ఆ దేశంలో ఒక రైల్లో ప్రయాణం చేసేడుట. టిక్కెట్టు వొసూలు చేసే గేటు దగ్గిర ఒక ఆఫీసరు బల్లా కుర్చీ వేసుకుని కూర్చున్నాడట. గేట్లోంచి అవతలికి వెళ్లిపోతున్న ప్రతి వ్యక్తిదగ్గిరా టిక్కెట్టు పుచ్చుకొని ఒక్కొక్క వ్యక్తికీ కొన్ని 'యన్'లు చెల్లిస్తున్నాడట. మన భారతీయుడు "టిక్కెట్టు కొన్నప్పుడు నాకు చిల్లర ఇచ్చేసేరండీ" అన్నాడుట. ఆ ఆఫీసరు, "ఔను, నిజమే కాని, ఇది మీకు నష్ట పరిహారంగా చెల్లిస్తున్నాం" అన్నాడట.